సాక్షి
జగిత్యాల
ఆదివారం । 8 । జనవరి । 2023



బీజేపీ శ్రేణుల సమ్మేళనం

జగిత్యాలటౌన్: స్థానిక బీఎల్ఎన్ గార్డెన్స్‌లో శనివారం బీజేపీ అసెంబ్లీ బూత్‌స్థాయి సమ్మేళనం నిర్వహించారు. ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్ విధానంలో మాట్లాడారు.



వ్యాపారులకు లైసెన్స్‌లు

జగిత్యాల: తినుబండారాల వ్యాపారులకు జిల్లా ఆహార పదార్థాల నియంత్రణ అధికారి బాపూజీ శనివారం లైసెన్స్‌లు జారీచేశారు.

గరిష్టం/కనిష్టం
28.0 /10.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గి పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్నేహితుడి కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న స్నేహితులు

రాయికల్(జగిత్యాల): పట్టణానికి చెందిన మోర వాయుకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబపరిస్థితి తెలుసుకున్న 1993–94 పదో తరగతి స్నేహితులు తలా కొంత పోగేశారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.3,25,500 శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసాల శ్రీధర్, కడకుంట్ల జగదీశ్వర్, బోగ రాము, గరిపెల్లి శ్రీనివాస్, కూరగాయల రవి, కూరగాయల అశోక్, వాసం దిలీప్, వాసం జలేందర్, గట్టుపల్లి నరేశ్, తాటిపాముల శేఖర్, ఆనందరాజు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 419 క్రీడా ప్రాంగణాలు



పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): జిల్లాలో 419 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్డీవో లక్ష్మీనారాయణ తెలిపారు. అమ్మక్కపేట క్రీడా ప్రాంగాణం, నర్సరీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. జిల్లాలో ఇప్పటివరకు 252 క్రీడా ప్రాంగాణాల పనులు పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. తొమ్మిదో విడత హరితహారం కోసం 380 నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నామని పేర్కొన్నారు. వచ్చే జూన్ వరకు అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, ఎంపీడీవో ప్రభు, ఏపీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘికశాస్త్రం అందరికీ ప్రేరణ



బహుమతి అందిస్తున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి

జగిత్యాలజోన్: పౌరులందరికీ సాంఘికశాస్త్రం ఓ ప్రేరణగా నిలుస్తుందని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ, సాంఘికశాస్త్రం చదవడం ద్వారా సమాజ విలువలు తెలుస్తాయన్నారు. బాధ్యతగా నడుచుకునే విధానం అలవడుతుందని ఆయన చెప్పారు. అనంతరం పరీక్షలో ప్రతిభ కనబర్చిన ఎం.సంజన, ఆర్.సింధూ, జె.మనోజ్ఞ, డి.స్పందన, ఎ.వైష్ణవి, బి.రాణికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. దంత వైద్యుడు అభిషేక్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీపాద నరేశ్, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నాల లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బుదారపు హనుమాన్‌సాగర్, సభ్యులు శ్రీదీప్, మహిపాల్, మహేశ్, రవి, రామస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషి అభినందనీయం



అవార్డు అందిస్తున్న డీఎం ప్రసూనలక్ష్మి

కోరుట్ల: ఆర్టీసీ ప్రగతికి ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని కోరుట్ల డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో శనివారం ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. సంస్థ ఎండీ సజ్జనార్ చేపట్టిన ప్రతీ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ఉద్యోగులు విజయవంతం చేస్తున్నారని, తద్వారా సంస్థను లాభాల్లోకి తెస్తున్నారని అన్నారు. అందులో భాగంగా కోరుట్ల డిపో అధిక ఆదాయం రాబట్టిందని, ఇందుకు కారణమైన కండక్టర్లు, డ్రైవర్లకు అవార్డులు అందజేశామన్నారు. ప్రతీ ఉద్యోగి వీరిని ఆదర్శంగా తీసుకొని అవార్డులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్, మెకానికల్ ఫోర్‌మెన్ తిరుపతి, తిరుమల్‌రావు, గోపాల్, శోభారాణి, భూమయ్య, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

Sunday Special

వాయుపుత్ర.. వాహన మిత్ర..!



కొండగట్టు ఆంజనేయస్వామి

- వజ్రకాయుడి చెంత వాహన పూజలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొండగట్టు, గట్టుదుద్దెనపల్లి, అగ్రహారం ప్రసిద్ధి
- ఈ మూడూ ఆంజనేయుడి కోవెలలే..
- దళితబంధు వాహనాలతో ఆలయాల్లో నిత్యం రద్దీ
- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక



గట్టుదుద్దెనపల్లి ఆలయంలో ట్రాక్టర్‌కు పూజలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆంజనేయుడు అంటేనే అభయం. వజ్రకాయుడి పేరు పలికితే తెలియని మనోబలం. ధైర్యానికి, స్థైర్యానికి, విశ్వాసానికి మారుపేరు హనుమంతుడు. ఉమ్మడి జిల్లాలో కొండగట్టుపై వెలసిన పవనసుతుడి గొప్పతనం తెలియనివారుండరు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఉమ్మడి జిల్లావాసులకు దాదాపు కులదైవం. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి నుంచి ప్రతీ ఇంట ఆంజనేయుడి పేరును ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పెట్టుకుంటారంటే అతిశయోక్తి కాదు. ఏ వాహనం కొన్నా మారుతి పాదాల చెంత తొలిపూజ చేసిన తరువాతే రంగంలోకి దింపుతారు. ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు ఆ తరువాత మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి, వేములవాడ మండలం అగ్రహారంలోని అంజన్న ఆలయాలు వాహనపూజలకు ప్రసిద్ధి చెందినవి. ఆయా ఆలయాల విశిష్టతపై సండే స్పెషల్..

చిన్న కొండగట్టు గట్టుదుద్దెనపల్లి

చిన్నకొండగట్టుగా పేరొందిన మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి ఆంజనేయస్వామి ఆలయం కూడా రోజురోజుకి ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. గట్టుదుద్దెనపల్లిలో ఆంజనేయుడి ప్రాచీన విగ్రహాన్ని పెద్ద బండరాయిపై చెక్కారు. అది కాలావధులపై సమాచారం లేదు. 1982 నుంచి గ్రామస్తులు ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం సగటున రోజుకు 200కుపైగా వాహనాలు ఇక్కడ పూజలు అందుకుంటాయి. దళితబంధులో మంజూరైన 1,285 వాహనాలకు ఇక్కడే పూజలు చేయించారు.



కొండగట్టులో వాహన పూజలు

700 ఏళ్ల చరిత్ర..

కొండగట్టు దేశంలోని అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటి. ఇక్కడి స్వామివారిని దాదాపుగా 700 ఏళ్లుగా కొలుస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయి. కొండగట్టు మీద వాహన పూజల సంప్రదాయం అనాదిగా వస్తోంది. ఒకప్పుడు రాజులు, సంస్థానాధీశులు, జమీందారుల రథాలు, రైతుల ఎండ్లబండ్లకు పూజలు జరిగేవి. ప్రస్తుతం కొండగట్టుకుపై నెలకు 5000 కుపైగా వాహనాలు పూజకు వస్తాయి. సగటున రోజుకు 170 వాహనాలు ఇక్కడ పూజలందుకుంటాయి. మన రాష్ట్రమే కాదు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తమ కొత్త వాహనాలకు పూజలు చేయిస్తుంటారు.

అగ్రహారంలో..

వేములవాడ మండలంలోని అగ్రహారం శ్రీ జోడాంజనేయస్వామి ఆలయంలోనూ వాహనపూజలు చేస్తుంటారు. మంగళవారం, శనివారం నాడు ఎక్కువ సంఖ్యలో వాహనపూజలు నిర్వహిస్తారు. మిగితా రోజుల్లోనూ పదులసంఖ్యలో వస్తుంటాయి.

దసరాకు రద్దీగా..

ఈ మూడు ఆలయాల్లోనూ దసరా రోజు పూజ చేయించేందుకు వేలాది వాహనాలు వరుస కడతాయి. దసరారోజు ఈ ఆలయాల వద్ద పూజలు చేయిస్తే.. మంచి జరుగుతుందన్న విశ్వాసంతో ఆ రోజున పాత వాహనాలకు సైతం ఇక్కడ పూజలు చేయడం గమనార్హం. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు, సివిల్ పనులు చేసే కాంట్రాక్టర్లు తమ వాహనాలను కొండగట్టుకు తీసుకువస్తుంటారు.

దళితబంధుతో తాకిడి

హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకం ద్వారా 8,851 మంది లబ్ధిదారులకు వాహనాలు అందజేశారు. ఇందులో జేసీబీలు, ట్రాక్టర్లు, ట్రక్కులు, లారీలు, ఆటోలు, ట్రాలీలు ఉన్నాయి. వాహనమేదైనా బాహుబలి వద్ద పూజ చేయించకుండా బయటికి తీసేదే ఉండదంటే అతిశయోక్తి కాదు. దళితబంధులో ఇచ్చిన వాహనాల్లో హుజూరాబాద్ మాత్రమే కాకుండా.. ఉమ్మడి జిల్లా, పొరుగున ఉన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి కూడా కొండగట్టు, గట్టుదుద్దెనపల్లి, అగ్రహారానికి తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తున్నారు.

పవన్ వారాహి



కేసీఆర్, పవన్ నోట కొండగట్టు

గతేడాది డిసెంబరు 7వ తేదీన జగిత్యాలలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రకటించి తన భక్తిని చాటుకున్నారు. అదే నెలలో జనసేన పార్టీ అధినేత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ ఎన్నికల రథం వారాహికి జనవరి నెలాఖరున పూజలు చేస్తానని ప్రకటించడంతో మరోసారి కొండగట్టు పేరు మీడియాలో పతాక శీర్షికలకు ఎక్కింది. ప్రతీవారం మంత్రులు, ప్రముఖులు, ఎమ్మెల్యేలు, సాధారణ భక్తుల తాకిడితో పుణ్యక్షేత్రం కిటకిటలాడుతోంది.

సహకార సంఘాలకు ఆదాయం

- 276 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు
- రూ.539.48 కోట్ల విలువైన వడ్ల సేకరణ
- పీఏసీఎస్‌లకు రూ.8.38 కోట్ల కమీషన్



జగిత్యాల సహకార సంఘం కార్యాలయం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కొనుగోళ్లలో కీలకంగా వ్యవహరించిన సహకార సంఘాలు సుమారు రూ.539.48 కోట్ల విలువైన వడ్లు సేకరించాయి. ఒకప్పుడు రైతులకు పంట రుణాలు మంజూరు చేయడం, రుణవాయిదాలు వసూలు చేయడానికే పరిమితమైన సహకార సంఘాలు.. ఇప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ కమీషన్ రూపంలో మంచి ఆదాయం ఆర్జిస్తున్నాయి. సంఘంలోని సభ్యులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడికక్కడే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి.

జిల్లాలో 276 కొనుగోలు కేంద్రాలు..

- జిల్లాలోని సహకార సంఘాల ద్వారా గ్రామాల్లో 276 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- జిల్లాలో 306 గ్రామ పంచాయతీలు ఉండగా, చిన్న గ్రామాలను మినహాయించి, అన్ని పంచాయతీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- వాటి పరిధిలోని రైతుల నుంచి మద్దతు ధర క్వింటాల్‌పై రూ.2,060తో కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు తరలించాయి.
- సహకార అధికారుల పర్యవేక్షణలో చైర్మన్‌లు, డైరెక్టర్లు రోజూ కొనుగోళ్ల తీరు పర్యవేక్షించి, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూశారు.

26.18 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు..

వానాకాలంలో వరి సాగుకు ఈసారి ఆంక్షలు లేవు. రైతులు అధిక విస్తీర్ణంలో దొడ్డురకం వడ్లు పండించారు. ఆశించిన స్థాయిలో దిగుబడి కూడా వచ్చింది. కొనుగోలు కేంద్రాల ద్వారా దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేయడం రైతులు నేరుగా అక్కడికే వడ్లు తరలించారు. మహిళా సంఘాల కంటే ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన సహకార సంఘాలు.. సీజన్‌లో 38,025 మంది రైతుల నుంచి సుమారు రూ.539.48 కోట్ల విలువైన దాదాపు 26.18 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశాయి.

కమీషన్ రూ.8.38 కోట్లు..

- ధాన్యం కొనుగోలు చేసినందుకు సివిల్ సప్లయ్ అధికారులు సహకార సంఘాలకు క్వింటాల్‌పై రూ.32 కమీషన్ చెల్లిస్తోంది.
- ఇలా, జిల్లాలోని సహకార సంఘాలకు సుమారు రూ.8.38 కోట్ల వరకు కమీషన్ వస్తుందని అంచనా.
- ఎక్కువ ధాన్యం కొనుగోలు చేస్తే కమీషన్ కూడా అధికంగా వస్తుందనే కారణంతో ధాన్యం సేకరణకు పీఏసీఎస్‌లు పోటీపడ్డాయి.
- కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికాగానే సివిల్ సప్లయ్ అధికారులు కమీషన్ చెల్లించాల్సి ఉంది.
- ఈసారి కమీషన్ చెల్లింపుల్లో తాత్సారం చేస్తున్నారు.
- కమీషన్ సొమ్ము వస్తే.. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తదితర వ్యాపారాల్లో పెట్టుబడి పెడతాయి.
- అంతేకాదు.. కొన్ని సంఘాలు పెట్రోల్ బంక్‌లు కూడా స్థాపిస్తున్నాయి.
- గ్రామాల్లో సూపర్ మార్కెట్లు ప్రారంభించే ఆలోచనలు చేస్తున్నాయి.
- కూలీల శ్రమను తగ్గించేందుకు ఆధునిక పరికరాలు కొనుగోలు చేసి, రైతులకు అద్దెకు ఇచ్చే ప్రయత్నాలూ చేస్తున్నాయి.
- ధాన్యం, ఎరువుల నిల్వ కోసం గోదాములు కూడా నిర్మిస్తున్నాయి.
- పంట రుణాలే కాకుండా వాహన, బంగారం తాకట్టు రుణాలు, విదేశీ విద్య రుణాలు కూడా మంజూరు చేస్తున్నాయి.

మంచి ఆదాయం



ధాన్యం కొనుగోలుతో వచ్చే కమీషన్ సహకార సంఘాలకు ఊపిరినిస్తుంది. గతంలో ఎలాంటి ఆదాయం లేక సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. మా సంఘం పరిధిలోనే దాదాపు 10 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మంచి ఆదాయం పొందాం. – పి.మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, జగిత్యాల

కొనుగోళ్లలో పోటీ



సహకార సంఘాలు ధాన్యం కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. కొన్నిసంఘాలు వాటి పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఐకేపీలకు గట్టి పోటీ ఇస్తున్నాయి. కమీషన్ రూపంలో వచ్చిన సొమ్మును మరిన్ని వ్యాపారాలు చేసేందుకు వినియోగిస్తున్నాయి.
– రామానుజాచారి, జిల్లా సహకారాధికారి

‘రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు కుట్ర’



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు మాస్టర్‌ప్లాన్ పేరుతో ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. యావర్ రోడ్డు విస్తరణ డిమాండ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మాస్టర్‌ప్లాన్‌ను తెరపైకి తెచ్చారని ధ్వజమెత్తారు. జిల్లా మరో కామారెడ్డి కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ శనివారం విలేకరులతో మాట్లాడారు. నర్సింగాపూర్, తిప్పన్నపేట, కండ్లపెల్లి, తిమ్మాపూర్, హస్నాబాద్, లింగంపేట గ్రామాల్లో రిక్రియేషన్, ఇండస్ట్రియల్ జోన్ల ఏర్పాటు పేరిట వెయ్యి ఎకరాలు రిజర్వ్ చేశారని, దీనిద్వారా రైతులు తమ భూములు వినియోగించుకునే హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా భూముల విలువలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. యావర్‌రోడ్డును విస్తరిస్తామని ఎన్నికల్లో లబ్ధిపొంది ఇప్పుడు కోర్టుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్న అధికార పార్టీ నాయకుల తీరు స రికాదని దుయ్యబట్టారు. నాయకులు తాటిపర్తి విజయలక్ష్మి, కళ్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, చందా రాధాకిషన్, రఘువీర్‌గౌడ్, మధు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలి

- హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్

జగిత్యాలజోన్: న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని హైకోర్టు జడ్జి, జగిత్యాల పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ అన్నారు. జిల్లా జ్యుడీషియల్ ఆఫీసర్స్ సమావేశంలో పాల్గొనేందుకు శనివారం ఆయన జిల్లాకు చేరుకున్నారు. తొలుత ఆయన పోలీస్ అతిథి గృహంలో పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. స్పెషల్ సబ్ జైలును సందర్శించారు. అనంతరం జగిత్యాల బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొత్త జిల్లా కోర్టుల ఏర్పాటుతో సిబ్బంది సమస్య ఏర్పడిందని, పోస్టుల భర్తీకి ప్రభుత్వంతో హైకోర్టు చర్చించిందని అన్నారు. కాగా, మహిళలకు ప్రత్యేక బార్ రూం ఏర్పాటు చేయించాలని న్యాయవాదులు కోరారు. కోర్టు సిబ్బంది కొరతతో కేసుల పరిష్కారంలో ఇబ్బంది ఎదురవుతోందన్నారు. కోర్టు సెక్షన్లలో పోలీసు కానిస్టేబుళ్లు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ వారే పెత్తనం చెలాయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమను హైకోర్టు జడ్జి ఆదేశించారు. అనంతరం, జిల్లాలోని జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఎస్పీ సింధూశర్మ మర్యాదపూర్వకంగా హైకోర్టు జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వీరయ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, మొదటి, రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు జితేందర్, వినిల్‌కుమార్, ధర్మపురి మెజిస్ట్రేట్ శ్యాంప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

హక్కులు వినియోగించుకోవాలి

కోరుట్ల: ప్రతీ పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులు సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టును కొత్త భవనంలోకి తరలించారు. ఈ కోర్టు భవనాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రవణ్, జగిత్యాల న్యాయమూర్తి నీలిమ, కోరుట్ల జడ్జి నిహారికతో కలిసి ప్రారంభించారు. అనంతరం జస్టిస్ శ్రవణ్‌కుమార్ మాట్లాడారు. కోర్టు భవనాన్ని సొంత ఇంటికంటే అందంగా తీర్చి దిద్దారని, నూతన గృహ ప్రవేశం చేసిన అనుభూతి కలుగుతోందని అన్నారు. కాగా, కోరుట్లలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను హైకోర్టు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి న్యాయమూర్తి శ్యాంప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి రాజేశ్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో ఇనుమడుగు పీఠాధిపతి



శ్రీహరిస్వామిజీకి ప్రసాదం అందజేస్తున్న భీమాశంకరశర్మ

వేములవాడ: ఇనుమడుగు పీఠాధిపతి శ్రీశ్రీ శ్రీహరిస్వామిజీ శనివారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం వారికి ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అద్దాల మంటపంలో వేదమంత్రాలతో ఆశీర్వచనం గావించారు. వారి వెంట పర్యవేక్షకులు అల్లి శంకర్, శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియా

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో శుక్రవారం మృతిచెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రడం పరుశరాం కుటుంబానికి రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని కార్మికసంఘం నాయకులు, కార్మికులు పరుశరాం మృతదేహంతో కంపెనీ గేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాదాపు 12గంటల ఆందోళన అనంతరం కార్మికసంఘం నాయకులు, కంపెనీ అధికారులకు మధ్య జరిగిన చర్చల్లో రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు దహనసంస్కారాల ఖర్చులకు రూ.25వేలు, కుటుంబంలో ఒకరికి స్కిల్డ్ ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకారం కుదరడంతో ఆందోళన విరమించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్, పెద్దపల్లి ఎస్సైలు శ్రీనివాస్, రాజేశ్, సహదేవ్‌సింగ్‌తో పాటు పోలీసిబ్బంది బందోబస్తు నిర్వహించారు. చర్చల్లో కంపెనీ ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ గోవిందరావు, కార్మిక సంఘం అధ్యక్షుడు నూర సమ్మయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

జగిత్యాల: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగించినట్లు స్థానిక అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ శ్యామ్ శనివారం తెలిపారు. ఈనెల 9 – 13లోగా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 98492 66786 మొబైల్‌నంబరులో సంప్రదించండి.

పడకేసిన గోదావరి పర్యాటకం



గోదావరినదిలో రెగెట్టా పోటీలు (ఫైల్)



తుమ్మపొదల్లో ఉన్న ఏసీ బోట్

- తుమ్మ పొదల్లోనే ఏసీ బోట్
- ప్రతిపాదనలకే పరిమితమైన హరిత హోటల్

గోదావరిఖని(రామగుండం): గోదావరి పర్యాటకం పడకేసింది. మరో నెలరోజుల్లో ఏసీ బోట్ ప్రారంభిద్దాం అనే సమయంలోనే భారీ వర్షాలకు పడవ కొట్టుకుపోయి తుమ్మల్లో చిక్కుకుంది. రెండేళ్లు దాటినా పర్యాటకానికి మోక్షం లేకుండా పోయింది. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరి తీరంలో పర్యాటకం కావాలని అధికారులను కలిసి కోరడంతో దానికి మంజూరు చేయించారు. కానీ అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు. గత నెల సింగరేణి పర్యాటకం ప్రారంభమైంది కానీ గోదావరి పర్యాటకం కలగానే మిగిలింది.

కాళేశ్వరం ఏర్పాటుతో..

కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో ఏడాది పొడవునా గోదావరినది నీటితో కళకళలాడుతోంది. నది తీరం మరో కోనసీమగా మారుతోందని ఈప్రాంత ప్రజలు ఆశపడ్డారు. తీరంలో సమ్మక్క– సారలమ్మ గద్దెలు, స్నానాలకు వీలుగా పుష్కరఘాట్, పర్యాటకులకు ఆసక్తి గొలిపే రెగెట్టా పోటీలు, రెండు బ్రిడ్జిలపై నిల్చుని పోటీలను వీక్షించేందుకు పర్యాటకులకు అనుకూలంగా ఉన్నాయి. గోదావరి అందాలను వీక్షించేందుకు వీకెండ్‌లో పడవ ప్రయాణం కోసం రూ.80లక్షలతో పర్యాటక శాఖ నుంచి డబుల్‌డెక్కర్ ఏసీ బోట్ కొనుగోలు చేశారు. అంతా సిద్ధమై ప్రారంభమవుతుందనే క్రమంలో భారీ వర్షాలతో పడవ కొట్టుకుపోయి తుమ్మపొదల్లోకి చేరింది. దానికి మరమ్మతు చేసి నదిలోకి తీసుకువచ్చేందుకు జాప్యం జరుగుతోంది.

కలిసిరాని పర్యాటకుల బోట్

రెండేళ్ల క్రితం సమ్మక్క– సారలమ్మ జాతర సమీపంలో గోదావరినదిలో ఏసీ బోట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. పూణే నుంచి వచ్చిన నిపుణులు డబుల్‌డెక్కర్ ఏసీ బోట్‌కు ఇన్‌స్టాలేషన్ చేశారు. అంతా పూర్తయి ఇక నదిలోకి ప్రవేశించే సమయంలో ఏసీకి సంబంధించిన కాపర్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రెండు నెలలు జాప్యం జరిగింది. తర్వాత బాలారిష్టాలు సవరించుకుని తిరిగి నదిలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యే క్రమంలో భారీ వర్షాలు పడ్డాయి.

పర్యాటకానికి అనుకూలంగా నది తీరం

జిల్లాలోనే అతిపెద్ద పట్టణంగా ఉన్న గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి సమీపంలో ఉన్న నది తీరం పర్యాటక క్షేత్రంగా విరాజిల్లేందుకు అన్ని వసతులున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, ఎన్టీపీసీ పవర్‌ప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్‌తో పాటు గోదావరి బ్రిడ్జికి కొద్ది దూరంలో సుందిళ్లబ్యారేజీ సందర్శన స్థలం ఉంది. తీరం వెంట ఇరువైపులా వంద ఫీట్ల రహదారి ఏర్పాటు చేసి పచ్చని చెట్లు, పచ్చిక బయళ్లతో మరో కోనసీమగా మార్చే అవకాశాలు బోలెడు ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పర్యాటకానికి జాప్యం జరుగుతోంది. ఈప్రాంతానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారనే ఆలోచనతో గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలో హరిత హోటల్ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. హోటల్ నిర్మాణం ప్రతిపాదనల దశలోనే ఉంది.

నిలిచిన రెగెట్టా పోటీలు

గోదావరిపై సుందిళ్ల బ్యారేజీ ఏర్పాటుతో నది ఏడాది పొడవునా నీటితో నిండుకుండలా మారింది. ఏటా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లో నిర్వహిస్తున్న మాదిరిగా ఇక్కడ రెగట్టా పోటీలు ఒక్కసారి విజయవంతంగా నిర్వహించారు. పోటీల ఈవిషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి ఎమ్మెల్యే చందర్ తీసుకెళ్లడంతో గోదావరితీరాన్ని మరింత పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో రెండు బోట్లు, ఫ్లోటింగ్ ప్లాంట్ ఫాం, రూ.80లక్షలతో పెద్ద పడవ తెప్పించారు.

సింగరేణి పర్యాటకంతో పెరగనున్న సందడి



ఇటీవల సింగరేణిగని దర్శించడానికి వచ్చిన పర్యాటకులు

ఆర్టీసీ చేపట్టిన సింగరేణి సందర్శన్‌తో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ఇటీవల భారీగా పర్యాటకులు ఆర్టీసీ ప్యాకేజీ ద్వారా వచ్చారు. ప్రతివారం ఒకటిలేదా రెండు బస్సుల్లో హైదరాబాద్ నుంచి వస్తున్నారు. ఈక్రమంలో గోదావరినదిపై బోట్ టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేస్తే మరింత సందడి పెరగనుంది.

త్వరలో మరమ్మతు చేస్తాం

భారీ వర్షాలకు కొట్టుకుపోయి తుమ్మల్లో చేరిన బోట్‌ను బయటకు తీసుకవచ్చేందుకు నిర్ణయం తీసుకున్నాం. బోట్ తయారు చేసిన కాంట్రాక్టు ద్వారా విడిభాగాలుగా విడదీసి సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం. ఇన్‌స్టాలేషన్ చేసిన అనంతరం నదిలోకి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాం. అయితే మళ్లీ వరదలు వచ్చినా బోట్ సురక్షితంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నాం. బోట్ సేఫ్టీ కోసం అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని పంపించి స్టడీ చేస్తున్నాం. – మనోహర్‌రావు, రాష్ట్ర టూరిజం ఎండీ

హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే

జ్యోతినగర్(రామగుండం): కోర్టు ధిక్కార కేసులో ఎన్టీపీసీ చైర్‌పర్సన్‌కు రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలంటూ ఎన్టీపీసీ చీఫ్ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. నాన్–ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన ధిక్కార కేసులో 2022 డిసెంబర్ 31న ఎన్టీపీసీ చైర్‌పర్సన్‌కు రెండు నెలల జైలుశిక్ష విధించిన సందర్భంలో స్టే విధించినట్లు సమాచారం.

ఇద్దరిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణ పనుల్లో బోరు, పైప్‌లైను ధ్వంసం చేసిన తండ్రీకొడుకులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం.. కోనాపూర్‌కు చెందిన తుమ్మల నర్సవ్వ అదే గ్రామానికి చెందిన రాజిరెడ్డి నుంచి భూమి కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించింది. కాగా సదరు భూమి విషయంలో రాజిరెడ్డి అతడి తమ్ముడు రాజేశం మధ్య వివాదం కొనసాగుతుంది. వివాదం కొనసాగుతుండగానే భూమిని ఎలా కొనుగోలు చేశావని నర్సవ్వ ఇంటి నిర్మాణం చేస్తున్న ప్రదేశానికి వెళ్లిన రాజేశం అతడి కుమారుడు లక్ష్మణ్ బోరు, పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేశం, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో గల రామేశ్వరాలయంలో వాచ్‌మెన్‌పై దాడి చేసి చోరీకి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ నటేశ్ వివరాల ప్రకారం.. గత నెల 25న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలానికి చెందిన రౌతు పవన్(20) రామేశ్వరాలయంలోకి ప్రవేశించి వాచ్‌మెన్ గాజుల సత్తయ్యను ఐరన్ రాడ్‌తో గాయపరిచి హుండీలోని డబ్బు ఎత్తుకెళ్లాడు. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం గీతాభవన్ చౌరస్తాలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పవన్‌పై గతంలో ఒక మర్డర్ కేసు కూడా ఉంది. అతడి నుంచి రూ.2,500, ఐరన్‌రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిపోయిన వ్యాపారిని పట్టుకున్న బాధితులు..?

జగిత్యాలక్రైం: అప్పు పేరిట పలువురి నుంచి రూ.10 కోట్ల నుంచి రూ.22 కోట్ల వరకు వసూలు చేసి కుటుంబంతో సహా పారిపోయిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన రేగొండ నరేశ్‌ను బాధితులొకరు పట్టుకున్నట్లు సమాచారం. అప్పు తీసుకున్న వ్యాపారి 2021 సెప్టెంబర్ చివరి వారంలో పరారైన విషయం తెల్సిందే. పోచమ్మవాడకు చెందిన పిట్టల రజిత 2 అక్టోబర్ 2021న జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ సింధూశర్మ రెండు ప్రత్యేక బృందాలతో బెంగళూరు, హైదరాబాద్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో బాధితులంతా ఆందోళనకు గురయ్యారు. తాజాగా శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో రేగొండ నరేశ్‌ను సారంగాపూర్ మండలానికి చెందిన బాధితుడు పట్టుకున్నట్లు సమాచారం. పట్టుకున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై పట్టణ సీఐ కిశోర్‌ను వివరణ కోరగా.. తాము పట్టుకోలేదని, సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోలపై ఆరా తీస్తున్నామని వెల్లడించారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మహ్మద్ జావిద్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కొట్టడంతో శనివారం విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌పై పోలీస్‌స్టేషన్‌లో, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా విద్యార్థి చదవకపోవడంతో మందలించానని తెలిపారు.

యువతి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం మోరపల్లికి చెందిన 20ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. యువతి శనివారం ఉదయం చల్‌గల్ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లింది. కానీ ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన దుంపల రాజిరెడ్డికి చెందిన విద్యుత్ మోటార్‌ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పొరండ్లకు చెందిన దుంపల రాజిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద శనివారం ఉదయం విద్యుత్ మోటార్ పెట్టేందుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలుషిత నీటితోనే విద్యార్థులకు అస్వస్థత

- రాజన్నసిరిసిల్ల జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- పాఠశాలలో నీటి పరిశీలన
- నీటిని ల్యాబ్‌కు పంపిన భగీరథ అధికారులు



పాఠశాలను పరిశీలిస్తున్న రాధాకిషన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలుషితమైన నీటితో మధ్యాహ్న భోజనం వండిపెట్టడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. గొల్లపల్లిలోని పాఠశాల పరిసరాలు, నీటి సరఫరా చేస్తున్న సంపు నుంచి సేకరించిన నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ, భగీరథ నీటి సరఫరా రెండు రోజులుగా నిలిచిపోవడంతో ట్యాంకర్ ద్వారా తెచ్చిన నీటిని సంపులో నింపి.. వాటితోనే వంట చేయడం ద్వారా విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నామన్నారు. నీటిని పరీక్షలకు పంపగా, ల్యాబ్ నుంచి నివేదిక రాగానే దాని ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన ఆకుకూరలతో భోజనాన్ని వండి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.

చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఉన్నారని, పాఠశాలల్లో మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈవో రాధాకిషన్‌కు ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం సరోజన, బాల్‌రెడ్డి, నాయకులు దేవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



మడ్డి రాములు (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): అప్పుల బాధతో కౌలు రైతు మడ్డి రాములుగౌడ్(47) ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామానికి చెందిన రాములుగౌడ్ కౌలు రైతుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కౌలు చేసిన వ్యవసాయంలో నష్టపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య అంబిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన యాదగిరి మధురమ్మ (75) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఎస్ఐ రాజేశ్ వివరాలు.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మధురమ్మ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముత్తారం(మంథని): మండలంలోని పోతారం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. జమ్మికుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన మోతే అంజి ఓసీపీ– 2లో వోల్వో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం డ్యూటీ అనంతరం ఇంటికి వెళుతున్న క్రమంలో పోతారం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడకు చేరుకొని బాధితుడిని అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కత్తితో యువకుడి వీరంగం

కథలాపూర్(వేములవాడ): మండలంలోని అంబారిపేట గ్రామంలో శనివారం సాయంత్రం ఓ యువకుడు కత్తితో వీరంగం సృష్టించాడు. గ్రామస్తుల కథనం.. మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం అంబారిపేట ప్రభుత్వ పాఠశాల వద్దకు బైక్‌పై స్పీడ్‌గా వచ్చాడు. ఓ ఉపాధ్యాయురాలు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌తో ఢీకొట్టేలా స్పీడ్‌గా వెళ్లడంతో అక్కడే ఉన్న తోటి ఉపాధ్యాయులు సదరు యువకుడిని మందలించారు. అనంతరం ఉపాధ్యాయురాలు, విద్యార్థులు వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. తర్వాత యువకుడు బైక్‌పై ఆర్టీసీ బస్సును వెంబడించాడు. బస్సు ఎక్కి కత్తితో అటూఇటూ తిరుగుతూ హల్‌చల్ చేశాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. యువకుడి తీరుతో విసిగిపోయిన కొందరు ప్రయాణికులు వారించడంతో బస్సు దిగాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై రామచంద్రం అక్కడకు చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా కల్లు తాగిన మత్తులో ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు.

ప్రైవేటు క్లీనిక్ సీజ్



సీజ్ చేయిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని జనతా ప్రైవేటు క్లీనిక్‌ను శనివారం సీజ్ చేసినట్లు డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన చింతల బ్రహ్మంకు ఆర్ఎంపీ అస్లాం వైద్యం చేయగా వికటించింది. న్యాయం చేయాలని బాధితుడు సంబంధిత ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధితుడు బ్రహ్మం ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు క్లీనిక్‌ను సీజ్ చేసినట్లు డెప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌చంద్ర, డెమో అధికారి తులసి నారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, రాంకుమార్ ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రామగుండం: ఇంధన డిపోల సమీపంలో ముందు వెళుతున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొనగా కారులో ఉన్నవారు తృటిలో ప్రాణపాయం నుంచి బయటపడ్డారు. బాధితుల వివరాలు.. శనివారం రాత్రి కారులో హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తున్న క్రమంలో ఐటీసీ ఔట్‌లెట్ వద్ద కారు వెనుక వస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ వేగంగా ఢీకొనగా.. కారు అదే వేగంతో ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు, వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో గోదావరిఖనికి చెందిన వైఎస్సార్‌టీపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జీ జిమ్మిబాబు మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంపై అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఏలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ నవజాత శిశువు మృతి

- డాక్టర్ నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన

కరీంనగర్‌టౌన్: నగరంలోని కశ్మీర్‌గడ్డకు చెందిన ఇమ్రాన్– సన దంపతుల నవజాత శిశువు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. నాలుగు రోజుల క్రితం జన్మించిన శిశువుకు ఆరోగ్యం బాగా లేక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుకగల ఓ పిల్లల వైద్యుడి వద్దకు శనివారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. గంట పాటు చికిత్స అందించిన సదరు పిల్లల వైద్యుడు పరిస్థితి విషమించడంతో చొప్పదండి రోడ్‌లోని మరో ఆసుపత్రికి పంపించాడు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు మరణించాడు. అయితే మొదట ట్రీట్‌మెంట్ చేసిన వైద్యుడి నిర్లక్ష్యం వల్లే శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట కుటుంబీకులు, బంధువులు ధర్నా నిర్వహించారు. డాక్టర్‌పై భౌతికదాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై సదరు వైద్యుడిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

అప్రమత్తంగా ఉండాలి



వివరాలు తెలుసుకుంటున్న సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): అసంక్రమిత బీపీ, షుగర్, క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. బీపీ, షుగర్, క్యాన్సర్‌తో బాధపడుతున్నవారికి వైద్యం అందిస్తున్న తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 40 ఏళ్ల పైబడిన వారు వైద్యుల సలహా మేరకు రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజారోగ్యం వివరాలు సేకరించాలని చెప్పారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్, సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శరణావన్

రాయికల్(జగిత్యాల): అటవీ పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరణావన్ హెచ్చరించారు. శనివారం చింతలూరు గ్రామంలోని అటవీ క్షేత్రాన్ని పరిశీలించారు. క్యాంప పథకం కింద అటవీశాఖలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు నిఘా పెంచాలని అన్నారు. గ్రామాల్లో కలప లభిస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న ఎంపీ అరవింద్

కోరుట్ల: పట్టణంలోని బీజేపీ 140 బూత్ అధ్యక్షుడు కుందారపు కరుణాకర్ కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులకు శనివారం ఎంపీ ధర్మపురి అరవింద్ రూ.లక్ష అందజేశారు. అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయం అందించినట్టు పార్టీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపెల్లి సుఖేందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేశ్, రాజు, రాజమురళి పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా తెలంగాణ



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

ధర్మపురి: రాష్ట్ర ఏర్పాటుకు ముందు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ ప్రస్తుతం రూ.5లక్షల కోట్ల అప్పులతో అప్పుల తెలంగాణగా మారిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో శనివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్ మీటింగ్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణలో అవినీతి పాలన నడుస్తోందన్నారు. నాయకులు కన్నం అంజయ్య, సురభి నవీన్‌రావు, కస్తూరి సత్యం, కోరబోయిన సాంబయ్య పాల్గొన్నారు.

నాయకుల మధ్య వాగ్వాదం..

మీటింగ్ ముగిసే సందర్భంలో ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజన్న వర్గీయులకు వివేక్ వర్గ కార్యకర్తలకు వాగ్వాదం చోటుచేసుకుంది. వివేక్ ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారని కన్నం అంజయ్య బహిరంగంగానే ఆరోపించారు. ధర్మపురిలోని సమావేశానికి పెద్దపల్లి నాయకులను తీసుకురావడమేంటని ప్రశ్నించారు.

'సంపన్న ఎన్నారైలకు జాతర లాంటిది'

జగిత్యాలరూరల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 8 – 10వ తేదీవరకు భారత ప్రభుత్వం చేపట్టే 17వ ప్రవాసీ భారతీయ దివస్ ఎజెండాలో గల్ఫ్ కార్మికుల సమస్యలకు చోటుదక్కలేదని సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాస్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ గల్ఫ్ జేసీ శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'మజ్దూర్ ప్రవాసి దివస్' లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రవాసీ దివస్‌ను సంపన్న ఎన్నారైల జాతరగా మార్చేస్తున్నారని, గరీబు గల్ఫ్ కార్మికులను విస్మరించడం సరికాదని అన్నారు.

నిరుపేదలకు ఆసరా సీఎంఆర్ఎఫ్

మల్యాల: సీఎంఆర్ఎఫ్ వైద్య ఖర్చులకు ఆసరాగా నిలుస్తోందని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో మండల కేంద్రానికి చెందిన కొక్కుల లావణ్యకు రూ.34వేల విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం

రాయికల్: పట్టణానికి చెందిన జుంజూరు సుజాత అనే నిరుపేద అనారోగ్యంతో మృతిచెందగా శనివారం అంత్యక్రియల కోసం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.11వేలు సహాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎద్దండి దివాకర్‌రెడ్డి, సభ్యులు ఎలిగేటి అనిల్, గంట్యాల ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతి పనికీ తీర్మానం ఉండాలి



మాట్లాడుతున్న ఏపీడీ బాలె శివాజీ

ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ పనుల్లో ప్రతి పనికీ తీర్మానం తప్పనిసరిగా ఉండాలని ఏపీడీ బాలె శివాజీ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పనిచేసిన ప్రతీ పనికి ఎంబీ రికార్డు, చెక్ మేజర్ తప్పనిసరిగా చేయాలని కోరారు. పనులకు సంబంధించిన రికార్డులను 3 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఈసీ నవీన్, టెక్నికల్ అసిస్టెంట్లు రాము, స్రవంతి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదర్శం.. ఆ సర్పంచ్‌లు

- అభివృద్ధే లక్ష్యంగా గ్రామానికి భూవిరాళం
- ఆ భూమిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు గ్రామ ప్రథమ పౌరులు

సారంగాపూర్: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో అభివృద్ధి చేయడం, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేస్తూ.. సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి పనుల్లో మమేకం అవుతుంటారు. కానీ కొందరు సర్పంచ్‌లు గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలనే తపన కలిగి ఉంటారు. 2019లో గ్రామ సర్పంచ్‌లుగా ఎన్నికైన కొందరు సర్పంచ్‌లు ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు భూములు లేకపోతే రూ.లక్షల విలువ గల భూములను గ్రామానికి విరాళంగా అందించి ఆ భూమిలో వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



రేకులపల్లిలో నిర్మించిన వైకుంఠధామం

రేకులపల్లి సర్పంచ్ లక్ష్మి..

రేకులపల్లి సర్పంచ్ ఎలగందుల లక్ష్మి 2019లో రేకులపల్లి సర్పంచ్‌గా ఎన్నికైంది. గ్రామంలో అభివృద్ధి పనులకు గాను రూ.లక్షల విలువ గల 16 గుంటల భూమిని తన భర్త ఎలగందుల అశోక్ ప్రోత్సాహంతో తన అత్తమామల జ్ఞాపకార్థం గ్రామానికి అందించింది. ఈ భూమిలో 12గుంటల్లో వైకుంఠధామం, రెండు గుంటల్లో పల్లెప్రకృతివనం, మరో రెండు గుంటల్లో అన్ని హంగులతో గ్రామపంచాయతీ భవనం ప్రభుత్వ నిధులతో నిర్మించి పూర్తిచేసింది.

ఒడ్డెరకాలనీ సర్పంచ్ వెంకటేశ్..



ఒడ్డెరకాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణం

నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా ఒడ్డెరకాలనీని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. సర్పంచ్‌గా పల్లపు వెంకటేశ్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు రెవెన్యూ భూమి అందుబాటులో లేకపోవడంతో సర్పంచ్ 14గుంటల భూమిని విరాళంగా అందించాడు. ఈ భూమిలో ఒక కమ్యూనిటీ భవనం, రూ.25లక్షలతో గ్రామపంచాయతీ భవనం నిర్మిస్తున్నారు. అమ్మ లస్మక్క, నాన్న బాపు ప్రోత్సాహంతో ఈ భూమిని గ్రామానికి అందించినట్లు ఆయన తెలిపారు.

బీర్‌పూర్ సర్పంచ్ శిల్ప..



బీర్‌పూర్ సర్పంచ్ అందించిన భూమి

బీర్‌పూర్ గర్షకుర్తి శిల్ప గ్రామానికి రూ.5.50 లక్షల విలువ చేసే భూమిని విరాళంగా అందించారు. తన భర్త గర్షకుర్తి రమేశ్ ప్రోత్సాహంతో అందించినట్లు ఆమె చెప్పారు. కాగా ఈ భూమిలో ఓ సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రభుత్వ నిధులతో కమ్యూనిటీ భవన నిర్మించారు.

ప్రజల సహకారం మరువలేనిది



గ్రామాభివృద్ధికి భూమిని విరాళంగా అందించడంతో నా కుటుంబం పేరు గ్రామంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. నేను అందించిన భూమిలో ప్రభుత్వం పూర్తి చేసిన నిర్మాణా లు ఎప్పుడూ గుర్తుండేలా ఉంటాయి. నా పద వి కాలంలో ప్రజల సహకారం మరువలేనిది.

– ఎలగందుల లక్ష్మి, సర్పంచ్, రేకులపల్లి, బీర్‌పూర్

అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతా



ప్రజలు నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేను గ్రామానికి ఎంత చేసినా తక్కువే. నాకు కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉంది. నేను గ్రామానికి భూమిని విరాళంగా అందించడంతో గ్రామస్తులు నన్ను ఎప్పుడూ గుర్తుంచుకుంటారు. నేను అందించిన భూమిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఉంది.

– పల్లపు వెంకటేశ్, సర్పంచ్ ఒడ్డెరకాలనీ, సారంగాపూర్,

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



బీర్‌పూర్‌ను మరింత అభివృద్ధి చేయాలని ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ప్రతీ పైసాను సద్వినియోగం చేసుకొని, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాను. నేను అభివృద్ధి పనులకు అందించిన భూమి నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– గర్షకుర్తి శిల్ప, సర్పంచ్, బీర్‌పూర్

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పేదల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఇంటింటా తిరుగుతూ 47 మంది లబ్ధిదారులకు రూ.19.77లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగిత్యాలలో అభివృద్ధి జరిగిందని, రూ.4కోట్లతో సమీకృత మార్కెట్, త్వరలోనే మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సతీశ్, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్‌పై తిరుగుతూ.. ప్రజలతో ముచ్చటిస్తూ..

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శనివారం పట్టణాన్ని బైక్‌పై తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఒక్కరే బైక్‌పై తిరుగుతూ తెలిసిన అందరినీ పలకరిస్తూ పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదు'

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు బీజేపీలో ఎవరికీ లేదని జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. ఈ మేరకు శనివారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాయికల్ పట్టణానికి, మండలానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేశారో ఒకసారి చెప్పాలని కోరారు. రైతులను అడ్డం పెట్టుకుని గెలిచిన తర్వాత పసుపు రైతులను మోసం చేశారని ఆరోపించారు. మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేశ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అనుపురం శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు ఓరగంటి మోహన్‌రావు, హరీశ్‌రావు, బెక్కం తిరుపతి, నాగరాజు, కిషన్‌రావు పాల్గొన్నారు.

మంత్రిని పరామర్శించిన జెడ్పీచైర్‌పర్సన్



మంత్రిని పరామర్శిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య ఇటీవల మరణించగా శనివారం జగిత్యాల జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మంత్రిని పరామర్శించారు. వెల్గటూర్ మాజీ జెడ్పీటీసీ అశోక్, కౌన్సిలర్ మల్లిఖార్జున్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, బండారి నరేందర్, చెట్‌పల్లి సత్యం, కొలగాని సత్యం, బండారి రాజ్‌కుమార్, చిట్ల రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో రద్దీ



దర్శనానికి వచ్చిన భక్తులు

కొండగట్టు: కొండగట్టు అంజన్నను శనివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెండెంట్ సునీల్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అధికారులు సుధాకర్‌రెడ్డి, యాదగిరి, లతాదేవి, మంజుల, లక్ష్మీరాజం, లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఎంచుకోవాలి

సారంగాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని ప్రముఖ సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ అన్నారు. ఈ మేరకు శనివారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంపాక్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషిచేయాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

✦జూనియర్ కళాశాలకు మైక్‌సెట్ వితరణ

సారంగాపూర్: బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రముఖ పిల్లల వైద్యుడు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి రూ.20వేల విలువ గల మైక్‌సెట్‌ను అందించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ ఉన్నారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్: జగిత్యాల మండలం చల్‌గల్ 132/33 కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతు దృష్ట్యా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఇందులో భాగంగా చలగల్ సెక్షన్ పరిధిలోని చల్‌గల్, మోరపల్లి, చర్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

✦అయిలాపూర్‌లో గేదె, దూడ మృతి

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఏలేటి జలపతిరెడ్డికి చెందిన గేదె, దూడ మరణించాయి. రైతు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మందలోకి వెళ్లి వచ్చిన గేదె, దూడ ఎప్పటిలాగే రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత నీళ్లు తాగాయని, నీళ్లు తాగిన కొద్ది సేపటికే మృతిచెందాయని వాపోయాడు.

✦ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

గొల్లపల్లి: గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్‌ను 9వ తేదీ నుంచి 13వ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏనుగుల మల్లయ్య తెలిపారు. వివరాలకు 94409 50876 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

✦కళాశాలకు బీరువా అందజేత

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు కొంక వేణు రూ.10వేల విలువైన బీరువా, ర్యాక్‌లు కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణకు అందజేశారు.

✦నర్సరీ పరిశీలన

రాయికల్: మండలంలోని అయోధ్య, వీరాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో సంతోష్‌కుమార్ నర్సరీ, క్రీడా ప్రాంగణం పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

మన ఊరు–మన బడి పనులు పరిశీలన

వెల్గటూర్: మండలంలో మన ఊరు–మన బడి పనుల ప్రగతిని శనివారం సమగ్రశిక్ష ప్రాజెక్టు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజీవ్, జిల్లా సెక్టోరియల్ అధికారి దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. కొత్తపేట, గొడిశెలపేట గ్రామాల్లో పర్యటించారు.

✦శిశువుల సంరక్షణపై దృష్టిసారించాలి

జగిత్యాలరూరల్: నవజాత శిశువుల సంరక్షణపై దృష్టిసారించాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం జగిత్యాలరూరల్, అర్బన్ మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు ఇంక్రిమెంటల్ లెర్నింగ్ అప్రోచ్‌పై శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, రాణి, లావణ్య, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

✦చెక్కులు అందజేత

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు సాతారం, ఒబులాపూర్ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల చొప్పున చెక్కులను బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అందజేశారు. ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుయ్య శ్రీశైల మల్లేశ్‌యాదవ్, కుర్మా రాజరెడ్డి, గంగరాజం, రాజారాం పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

మెట్‌పల్లి: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కీర్తి ఫంక్షన్‌హాల్‌లో శనివారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ 99 బెటాలియన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్, మాబ్ కంట్రోలింగ్‌పై అవగాహన కల్పించారు. అంతకుముందు పురవీధుల గుండా ఆర్ఏఎఫ్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆర్డీవో వినోద్‌కుమార్, సీఐ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి కమిషనర్ రాజ్‌కుమార్, ఆర్ఏఎఫ్ అధికారులు రాహుల్, బాలస్వామి, డీఎస్ మాస్కర్, ప్రకాశ్, ఎస్ఐ శ్యామ్‌రాజ్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



జంక్షన్ల వద్ద సూచిక బోర్డులు ఏవీ?

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో ప్రధాన రోడ్డుపై వై.జంక్షన్ ఉంది. ఏ రోడ్డు ఏ గ్రామాల వైపు వెళ్తుందో చూపించే సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనాలపై వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. పొద్దంతా రోడ్డుపై ఉన్న ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. రాత్రివేళల్లో ఏ రోడ్డు ఎటు పోతుందో తెలియక వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. జంక్షన్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: రాజు, రోడ్లుభవనాల శాఖ, ఏఈ, కోరుట్ల
ఫోన్ నంబర్: 94408 18880

పాఠశాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి

జగిత్యాల: మన ఊరు.. మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి ఆదేశించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అదనపు కలెక్టర్లు లత, మకరంద్, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్ ఇళ్లు'

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జగిత్యాలకు 4,500 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని కలెక్టర్ రవి తెలిపారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్లులేని పట్టణవాసులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు.ఇంకా అర్హులు ఉంటే ఈనెల 8వ తేదీలోగా మీసేవలో కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



మల్లాపూర్: ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఈవో



బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో

మల్లాపూర్: జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో శనివారం సాంఘికశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో వీవీరావుపేట విద్యార్థులు ప్రథమ స్థానంలో ఎం.సంజన, ద్వితీయ స్థానంలో ఆర్.సింధు, తృతీయ స్థానంలో జె.మనోజ్ఞ నిలిచారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినికి ప్రథమస్థానం

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థిని స్పందన జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియం నుంచి ప్రథమస్థానంలో నిలిచింది. డీఈవో జగన్మోహన్‌రెడ్డి విద్యార్థినిని సన్మానించారు.

గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీలు పనిచేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మెట్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో శనివారం నియోజకవర్గంలోని బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్ పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ మండల స్థాయి పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న హరినాథ్

వెల్గటూర్: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. స్టోరీ టెల్లింగ్ విభాగంలో కె.ఆదిత్య(వెల్గటూర్) ప్రథమ, జి.శృతి(పైడిపెల్లి) ద్వితీయస్థానంలో నిలిచారు. స్పెల్ విజార్డ్ విభాగంలో కిషోర్(గొడిశెలపేట) ప్రథమ, ఎమ్.నవీన్ (పైడిపెల్లి) రెండోస్థానంలో నిలిచారు.

సారంగాపూర్ మండలంలో..

సారంగాపూర్: సారంగాపూర్ మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో స్టోరీ టెల్లింగ్ విభాగంలో రేచపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన బి.కావ్య, శ్రీవిద్య ప్రథమ, ద్వితీయ, స్పెల్ విజార్డ్ పరీక్షలో రేచపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన డి.స్పందన, అక్షయ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

మండలస్థాయి పోటీల్లో ప్రతిభ

కథలాపూర్: ఇంగ్లీష్ సబ్జెక్టులో స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్‌లో తాండ్ర్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కాలు వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచింది.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో విద్యార్థులకు మండలస్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు స్టోరీ టెల్లింగ్ పోటీల్లో రశ్మిత (గుండంపల్లి), సౌమ్య(వీవీరావుపేట) ప్రథమ, ద్వితీయ, స్పెల్ విజార్డ్ పోటీల్లో భరత్ మోడల్ స్కూల్ -మల్లాపూర్), ఎస్కే.రాహియా (జెడ్పీ హైస్కూల్ -మొగిలిపేట) ప్రథమ, ద్వితీయ బహుమతి సాధించారు.

రుణాల రికవరీపై దృష్టిసారించాలి

కథలాపూర్: గ్రామాల్లో మహిళా సంఘాల రుణాల రికవరీలపై సంఘం ప్రతినిధులు దృష్టిసారించాలని సెర్ప్ ఏపీఎం నరహరి పేర్కొన్నారు. మండలకేంద్రంలో స్త్రీశక్తి భవన్‌లో శనివారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు ఉపాధి అవకాశాలకు వినియోగించుకోవాలన్నా రు. సీసీలు విజయ నిర్మల, అంజయ్య, రమేశ్ పాల్గొన్నారు.